సాక్షి

మంచిర్యాల

మంగళవారం : 28 : మే : 2024



ట్రిపుల్ ఐటీ నోటిఫికేషన్ విడుదల
బాసర ట్రిపుల్ ఐటీ నోటిఫికేషన్ విడుదలైంది. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన పల్లె విద్యార్థులకు సువర్ణ అవకాశంగా మారింది. విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. 8లో▸



తాళం వేసిన 15నిమిషాలకే చోరీ
నస్పూర్‌లోని ఓ ఇంట్లో సోమవారం చోరీ జరిగింది. ఇంటికి తాళం వేసి వెళ్లిన 15నిమిషాల్లో దొంగలు పడ్డారు. అరగంటలో వచ్చేసరికి నగదు, బంగారం ఎత్తుకెళ్లారు. 8లో▸

గరిష్టం/కనిష్టం
43.0 /33.0

వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పడమర దిశగా వడగాలులు వేగంగా వీస్తాయి. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నకిలీ విత్తనాలు విక్రయిస్తే పీడీ యాక్ట్

- అక్రమ రవాణా నియంత్రణకు చెక్‌పోస్టులు
- రామగుండం సీపీ శ్రీనివాసులు



మాట్లాడుతున్న సీపీ శ్రీనివాసులు

మంచిర్యాలక్రైం: నకిలీ విత్తనాలు విక్రయించిన వారిపై పీడీ యాక్ట్ నమోదు చేస్తామని, ఎంతటి వారైనా ఉపేక్షించేంది లేదని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాసులు స్పష్టం చేశారు. కమిషనరేట్ ఆవరణలో సోమవారం రామగుండం పోలీస్ అధికారులకు నకిలీ, కల్తీ విత్తనాలు, నిషేధిత హెచ్‌టీ, కాటన్ విత్తనాల గుర్తింపుపై స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్(ఎస్‌ఓపీ) ఒక్క రోజు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ నకిలీ విత్తనాలు విక్రయించినా, బ్రాండెడ్ కంపెనీల పేరుతో నాసిరకం విత్తనాలు అమ్మినా కఠినమైన కేసులు నమోదు చేస్తామని తెలిపారు. ఫర్టిలైజర్, విత్తనాల విక్రయాల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని సూచించారు. దుకాణం లైసెన్స్, ఫారం(బీ), ఫారం(సీ) చెక్ చేయాలని, రెన్యూవల్, వ్యాలిడిటీ పరిశీలించాలని పేర్కొన్నారు. లేబుల్స్ ప్యాకింగ్ సీల్ సరి చూడాలని, కంపెనీ వివరాలు, తయారీ తేదీ పరిశీలించాలని, అనుమానాస్పదంగా కనిపిస్తే ల్యాబ్‌కు పంపించాలని తెలిపారు. అక్రమ రవాణా నియంత్రణకు సరిహద్దు ప్రాంతంలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామని, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ రాజు, సీసీఆర్‌బీ సీఐ బుద్దెస్వామి, కమిషనరేట్ పరిధిలోని సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌తో వన్యప్రాణులకు ప్రాణహాని



ఏరిన ప్లాస్టిక్‌తో ఇందన్‌పల్లి రేంజ్ సిబ్బంది

జన్నారం: ప్లాస్టిక్ వస్తువులను అడవిలో వేయడం వల్ల వన్యప్రాణులకు ప్రాణహాని సంభవించే ప్రమాదం ఉందని, ప్లాస్టిక్ రహిత అడవులుగా తీర్చిదిద్దాలని ఇందన్‌పల్లి ఫారెస్ట్ రేంజ్ అధికారి(ఎఫ్ఆర్వో) హఫీజొద్దీన్ అన్నారు. జన్నారం అటవీ డివిజన్ పరిధి ఇందన్‌పల్లి అటవీ రేంజ్‌లోని ఇందనపల్లి హనుమాన్ ఆలయం నుంచి ఆదిలాబాద్ చౌరస్తా వరకు ఇరువైపుల ప్లాస్టిక్ వస్తువులను సిబ్బంది ఏరి వేశారు. పోగయిన ప్లాస్టిక్‌ను గ్రామ పంచాయతీకి అప్పగించారు. ఈ సందర్భంగా రేంజ్ అధికారి మాట్లాడుతూ అడవి గుండా ప్రయాణించే వాహనదారులు ప్లాస్టిక్ కవర్లు, నీటి బాటిళ్లను అడవి ప్రాంతంలో పడేయవద్దని సూచించారు. ప్లాస్టిక్ సంచులు వన్యప్రాణులు తినే అవకాశం ఉన్నందున నిషేధించినట్లు తెలిపారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా పరిధిలోని యువతకు ఉచిత శిక్షణ కల్పిస్తున్నట్లు న్యాక్ అసిస్టెంట్ డైరెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వ దీన్‌దయాల్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన పథకంలో జనరల్ వర్క్, సూపర్‌వైజర్, వెల్డింగ్, ఎలక్ట్రీషియన్, పైపు ఫిట్టర్, ప్లంబింగ్, పెయింటింగ్ అండ్ డెకొరేషన్ తదితర కోర్సుల్లో మూడు నెలలపాటు ఉచిత శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. భోజనంతోపాటు యూనిఫామ్, శిక్షణ సామగ్రి అందిస్తామని తెలిపారు. 18 నుంచి 35 సంవత్సరాల వయస్సు వారు అర్హులని పేర్కొన్నారు. ఈ నెల 30లోగా దరఖాస్తు చేసుకోవాలని, ఇతర వివరాలకు సెల్: 9154548063, 8328507232 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

పాఠశాలల్లో పనులు పూర్తి చేయాలి

కోటపల్లి: అమ్మ ఆదర్శ పాఠశాల కింద చేపట్టిన పనులు విద్యాసంవత్సరం ప్రారంభం నాటికి పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ అధికారులకు సూచించారు. సోమవారం మల్లంపేట, పార్‌పల్లిలోని అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పనులను పరిశీలించారు. పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలని, జాప్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పనుల్లో నాణ్యత లోపం కనిపిస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అనంతరం మహిళా సమాఖ్య సంఘాల ఆధ్వర్యంలో విద్యార్థులకు యూనిఫాం కుడుతున్న కేంద్రాన్ని సందర్శించి బడులు తెరుచుకునే వరకు యూనిఫాంలు అందించాలని తెలిపారు. పీఆర్ఏఈ రాజేశ్వర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇక బదిలీలు!

- కింది స్థాయి నుంచి ఉన్నతాధికారుల వరకు
- కోడ్ ముగిశాక అధికారులకు స్థానభ్రంశం
- నచ్చిన చోట పోస్టింగ్‌ల కోసం పైరవీలు



సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: జిల్లా అధికారుల స్థానచలనానికి రంగం సిద్ధమవుతోంది. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల నిర్వహణ నేపథ్యంలో అధికారుల బదిలీ జరిగింది. ఎన్నికలు పూర్తి కావడం, రాష్ట్ర ప్రభుత్వం ఈ మేరకు సంసిద్ధంగా ఉండడంతో అధికారుల బదిలీలకు గ్రీన్‌సిగ్నల్ వచ్చినట్లయింది. లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వచ్చే నెల 4న వెలువడనున్నాయి. 6వరకు ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుంది. ఆ తర్వాత ఒక్కోశాఖ పరిధిలో బదిలీల ప్రక్రియ మొదలు కానుంది. ఈ క్రమంలో జిల్లాల్లో అన్ని శాఖల పరిధిలో కింది స్థాయి నుంచి ఉన్నత స్థాయి వరకు పని చేస్తున్న అధికారులకు స్థానచలనం తప్పనిసరిగా మారింది. సొంత జిల్లాలు, కుటుంబాలకు దూరంగా ఉంటూ జిల్లాలో విధులు నిర్వహిస్తున్న అధికారులంతా బదిలీల కోసం ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో తాము కోరుకున్న చోటుకు వెళ్లేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టారు. అంతేగాక ఎన్నికల బదిలీల్లో సొంత జిల్లా నుంచి ఇతర జిల్లాలకు వెళ్లిన వారంతా తిరిగి వచ్చేందుకు అవకాశాలు వెతుక్కుంటున్నారు. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల విధుల్లో పాల్గొన్న వారంతా దాదాపు బదిలీలపై వచ్చిన వారే ఉన్నారు. ఈ క్రమంలో పాలన సజావుగా సాగాలంటే దూరప్రాంతాల వారిని తిరిగి కోరుకున్న చోటుకు పంపేందుకు అవకాశం ఇవ్వాలని ఉద్యోగ సంఘాలు సైతం విజ్ఞప్తి చేశాయి.

రెవెన్యూ శాఖలో టెన్షన్

ఎన్నికల్లో కీలకంగా వ్యవహరించిన రెవెన్యూ శాఖలో పూర్తిగా బదిలీలు సాగే అవకాశం ఉంది. అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్లు(ఏఆర్‌వో), రిటర్నింగ్ ఆఫీసర్లు(ఆర్వో)గా ఉన్నారు. డీటీ, తహసీల్దార్, ఆర్డీవో, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఆపై ఆఫీసర్లకు స్థానచలనం కలిగే అవకాశం ఉంది. దీంతో ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం నుంచి తహసీల్దార్లు, జిల్లా పరిధిలోనే పలు మండలాల్లో ఇంటికి దూరంగా పని చేస్తున్న అధికారులు తిరిగి తమ స్థానాల కోసం ముమ్మరంగా ప్రయత్నిస్తున్నారు. ఇక పైరవీల ప్రభావంతో ఎవరికి ఎక్కడ పోస్టింగ్ దక్కుతుందోనని కొందరు టెన్షన్ పడుతున్నారు. మారుమూల మండలాలతోపాటు ఇతర జిల్లాలకు కలెక్టరేట్‌లో ఆయా సెక్షన్ల ఇన్చార్జిలుగా, ఆర్డీవో, ఆఫీసుల్లో సూపరింటెండెంట్ పోస్టులకు బదిలీ చేస్తారనే గుబులుతో ఉన్నారు. కొందరు కలెక్టరేట్‌లో కీలక శాఖల్లోనూ ఏళ్లుగా తిష్ట వేసి పని చేస్తున్నారు. పలు ఆరోపణలు, ఫిర్యాదులు వచ్చినా సీట్లు వదలడం లేదు. ఇక కొందరు ఉన్నతాధికారులను మచ్చిక చేసుకుని కోరుకున్న చోట కొనసాగుతున్నారు. ఈ క్రమంలో ఇలాంటి అధికారులకు బదిలీలు ఉండాలని సహచర ఉద్యోగులే కోరుతున్నారు. ఇక రెవెన్యూతోపాటు సాధారణ పరిపాలన, విద్య, వైద్యం, మున్సిపల్, పంచాయతీ, సాగునీటి, వ్యవసాయ, ట్రెజరీ, సహకార, పశు, అటవీ, పౌరసరఫరాల, సంక్షేమ శాఖలతోపాటు ఇతర అన్ని విభాగాల్లో పని చేస్తున్న అధికారులకు బదిలీలు ఉండనున్నాయి. దీంతో జిల్లా పరిధితోపాటు జోన్, మల్టీ జోన్ పరిధిలో పని చేస్తున్న అధికారులు అనుకూలమైన చోట పోస్టింగ్ కోసం పోటీ పడుతున్నారు. మరోవైపు కొందరు అనారోగ్యం, ప్రత్యేక పరిస్థితులతోనూ బదిలీల్లో తమకు ప్రాధాన్యత కోరుకున్నారు. ఈ క్రమంలో ఎవరికి ఎక్కడ పోస్టింగ్ వస్తుందోనని అధికార వర్గాల్లో చర్చ సాగుతోంది.

పోస్టింగ్ కోసం పైరవీలు

పోలీసు శాఖలో పని చేస్తున్న ఎస్సై, సీఐ, ఏసీపీ వరకు ఎన్నికల సమయంలో చాలామంది బదిలీపై వచ్చారు. అదే సమయంలో జిల్లాలో పని చేసున్న పోలీసు అధికారులు ఇతర జిల్లాలకు వెళ్లారు. వారంతా మళ్లీ జిల్లాకు వచ్చేందుకు తమ పరపతిని వినియోగిస్తున్నారు. ఇప్పటికే కొందరు పోలీసు అధికారులు రాష్ట్ర ప్రభుత్వంలో కీలకంగా ఉన్నవారు, తమ బంధువులు, తెలిసిన వారితో పోస్టింగ్‌ల కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. నిర్మల్, ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, పెద్దపల్లి, సిరిసిల్ల, జగిత్యాల, భూపాలపల్లి, వరంగల్‌కు చెందిన కొందరు రామగుండం కమిషనరేట్‌కు వచ్చేందుకు ఆసక్తిగా ఉన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో స్థానిక ఎమ్మెల్యేల సిఫారసు లేఖలకు ప్రాధాన్యత ఇవ్వడంతో కొందరికీ పోస్టులు దక్కాయి. ప్రస్తుత కాంగ్రెస్ సర్కారులోనూ అదే సిఫారసుల పద్ధతి కొనసాగుతుండడంతో ప్రయత్నాలు జరుగుతున్నాయి. పోలీసుశాఖతోపాటు ఆబ్కారీ, ఆర్టీఏ, వంటి యూనిఫాం సర్వీస్‌లో ఉన్న అధికారులు సైతం మంచి పోస్టింగ్ కోసం పైరవీలు చేసుకుంటున్నారు.

మళ్లీ భగ భగ



వెలవెలబోతున్న మంచిర్యాల వెంకటేశ్వర్‌టాకీస్ చౌరస్తా

- 46 డిగ్రీలకు పెరిగిన ఉష్ణోగ్రతలు
- నిర్మానుష్యంగా మారుతున్న కూడళ్లు
- ఎండలతో బోసిపోతున్న చిరు వ్యాపారాలు

మంచిర్యాలఅగ్రికల్చర్: రోహిణి కార్తెలో రోకళ్లు పగిలే ఎండలు ఇవే అన్నట్లుగా జిల్లాలో నాలుగు రోజులుగా ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. ఎండలు భగ భగ మండిపోతుండడంతో కూడళ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. సోమవారం బెల్లంపల్లిలో 45.7 డిగ్రీల ఉష్ణోగత నమోదు కాగా.. మిగతా మండలాల్లో 42 నుంచి 45 డిగ్రీలకు చేరింది. ఈ నెల ఆరంభంలో ఎండల తీవ్రత 47 డిగ్రీల వరకు కొనసాగగా.. 10 నుంచి 23 వరకు అక్కడక్కడ ఈదురుగాలులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసింది. దీంతో వాతావరణం చల్లబడి ఎండకాలం తగ్గినట్లేనని ప్రజలు సంతోషించారు. కానీ మళ్లీ ఎండలు పెరగడంతో ఉక్కపోత, వేడితో జిల్లా వాసులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. గరిష్ట ఉష్ణోగ్రత 46డిగ్రీలుగా నమోదు కావడంతో జిల్లా మళ్లీ రెడ్ జోన్‌లోకి వెళ్లింది. ఉదయం 9 గంటలు దాటిందంటే చాలు ఇంటి నుంచి బయటకు రావడానికి జంకుతున్నారు. ఉదయం 7 గంటల నుంచే సూర్య ప్రతాపం మొదలై సాయంత్రం 7 గంటల వరకు కూడా వడగాలుల తీవ్రత తగ్గడం లేదు. అత్యవసరమైతేనే బయటకు రావాలని వైద్యులు సూచిస్తున్నారు. జనసంచారం లేక పండ్లు, కూరగాయలు విక్రయాలు పడిపోయాయి.



మంచిర్యాల మార్కెట్ ఏరియాలో జన సంచారం లేక ఖాళీగా పండ్లబండ్లు

మరోవైపు ఎండకు కూరగాయలు, పండ్లు వాడిపోయి చిరువ్యాపారులు నష్టపోతున్నారు. ప్రయాణికుల రాకపోకలు లేక మధ్యాహ్న సమయంలో ఆర్టీసీ బస్సుల్లో సీట్లు ఖాళీగా కనిపిస్తున్నాయి. బస్టాండ్, రైల్వేస్టేషన్, ఇతర ప్రాంతాలకు ప్రయాణికుల రాకపోకలు లేక ఆటోల గిరాకీలు తగ్గాయని ఆటోవాలాలు వాపోతున్నారు.

తీవ్రంగా నష్టపోతున్నాం..



ఈ ఎండలతో దోసకాయలు పాడవుతున్నాయి. మధ్యాహ్నం 12 గంటలు అయ్యిందంటే జనాలు రోడ్లమీద కనిపించడం లేదు. అమ్మకానికి పొద్దున తీసుక వస్తే ఎండ, వేడిమి గాలుల త్రీవతకు మధ్యాహ్నం వరకు వాడిపోతున్నాయి. గిరాకీ లేక.. ఇటు కాయలు పాడై నష్టపోవాల్సి వస్తుంది.

– శ్యామ, రాయపట్నం, దోసకాయల వ్యాపారి

గిరాకీ రావడం లేదు



మధ్యాహ్నం 12 గంటలు తర్వాత రోడ్లమీద జనాలు ఉండడం లేదు. తీసుకు వచ్చిన మామిడి, జామ పండ్లు అమ్ముడుపోక నష్టపోతున్న. సాయంత్రం ఏడు గంటల తర్వాత గానీ గిరాకీ రావడం లేదు. ఏరోజుకారోజు అమ్ముడుపోతేనే లాభం ఉంటుంది. ఎండకాలం మరోసటి రోజు వరకు ఉంటే పండ్లు చెడిపోతున్నాయి. రోడ్డుమీద పడేసి పోవాల్సి వస్తుంది.

– లక్ష్మి మామిడి, జామ పండ్ల వ్యాపారి

కాయలు కరాబు అయితన్నాయి..

కూరగాయలతోపాటు సీజన్‌లో దొరికే మామిడి, జామ, నిమ్మ, ఇతర పండ్లు, కాయలు అమ్ముతుంటా. మార్కెట్ పక్కనే రోడ్డుమీద కవర్ల కింద అమ్మకాలు సాగిస్తున్నా. ఈ ఎండలకు కూరగాయలు, మామిడికాయలు, నిమ్మకాయలు అమ్ముడుపోక చెడిపోయినయి. రెండు వేల వరకు నష్టపోవాల్సి వచ్చింది. గతంలో గింత ఎండలు ఎప్పుడు కొట్టలేదు.

– నగరం లక్ష్మి, పండ్ల వ్యాపారి, బెల్లంపల్లి

గొర్రెలు పంపిణీ చేయాలని మంత్రికి వినతి

భీమారం: రాష్ట్ర వ్యాప్తంగా రెండేళ్ల క్రితం గొర్రెల కోసం డీడీలు చెల్లించిన వారికి సత్వరమే గొర్రెల యూనిట్లు అందజేయాలని గొర్రెలు, మేకలు పెంపకందారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము అశోక్ యాదవ్ మంత్రి సీతక్కను కోరారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లో ఆమెకు వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వం గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టి మొదటి విడతలో ఎంపికైన వారికి అందజేసిందని పేర్కొన్నారు. రెండో విడత లబ్ధిదారులు డీడీలు తీసి పశుసంవర్ధక శాఖ అధికారులకు అందజేశారని తెలిపారు. గొర్రెల యూనిట్లు అందజేయకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. సంఘం రాష్ట్ర సలహాదారు బేరి రాంచందర్, మేడ్చల్, వనపర్తి, భూపాల్‌పల్లి జిల్లా అధ్యక్షులు మధుయాదవ్, ఆవుల రాజుయాదవ్, గజ్జి రమేశ్ పాల్గొన్నారు.



మంత్రి సీతక్కకు వినతిపత్రం అందిస్తున్న అశోక్

తహసీల్దార్లు ఏం చేస్తున్నారు?

- రాత్రి దాకా కూర్చోబెట్టే పరిస్థితి తెచ్చుకోవద్దు
- ధాన్యం కొనుగోళ్లు, 'ధరణి' పరిష్కారంపై కలెక్టర్ అసంతృప్తి



టెలి కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: తహసీల్దార్లు ఇటు ధాన్యం కొనుగోళ్లు, అటు 'ధరణి' ఫిర్యాదులు పరిష్కరించకుండా ఏం చేస్తున్నారో అర్థం కావడం లేదని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు ఇదే తీరుగా ఉంటే రాత్రి పదిగంటల దాకా అక్కడే కూర్చొబెట్టి, గూగుల్ మీట్‌లో తాము పర్యవేక్షించే పరిస్థితి వరకు తెచ్చుకోవద్దని సూచించారు. వర్షాకాలం సమీపిస్తున్నా, ధాన్యం సేకరణలో రైతులు ఇబ్బంది పడుతారని చెబుతున్నా ఎందుకు ఆలసత్వం వహిస్తున్నారని ప్రశ్నించారు. సోమవారం ఆయన ధాన్యం కొనుగోళ్లు, ధరణి పోర్టల్ సమస్యలపై అన్ని మండలాల తహసీల్దార్లతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. వర్షాలు మొదలైతే ఏం చేయలేని పరిస్థితి ఉంటుందని, రైతులు ఇబ్బంది పడకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకోసం తమ మండల పరిధిలో ఉన్న ప్రతీ కొనుగోలు కేంద్రానికి వెళ్లి క్షేత్ర స్థాయిలో ఉన్న సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. ఎక్కడైనా మిల్లర్లు ధాన్యం దించుకోకున్నా, లారీల రవాణాలో జాప్యం జరిగితే పరిశీలించాలని చెప్పారు. రవాణా కాంట్రాక్టర్‌తో మాట్లాడి ఎక్కడికక్కడ సమస్య పరిష్కారం చేయాలని సూచించారు. తమ దృష్టికి తేవాలని అన్నారు. కానీ తహసీల్దార్లు కొనుగోలు కేంద్రాలకు వెళ్లడం లేదన్నారు. ఒకరిద్దరు మాత్రమే ఒకటి రెండు కేంద్రాలకు వెళ్లి వస్తున్నారని అన్నారు. దండేపల్లి మండలంలో ఇప్పటికే కొనుగోళ్లు పూర్తి కావాల్సి ఉన్నా ఎందుకు జాప్యం జరుగుతుందని ప్రశ్నించారు. మిల్లర్లు సీఎంఆర్ అప్పగించడంపై పర్యవేక్షించాలని కోరారు. ధరణి పోర్టల్ సమస్యలపై తమ పరిధిలో ఉన్న మాడ్యూల్స్‌లోనూ పరిష్కరించడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. జైపూర్ మండల తహసీల్దార్ ధరణి సంబంధిత ఫిర్యాదులు ఒక్కటి కూడా పరిష్కరించకుండా అన్ని పెండింగ్‌లోనే ఉంచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్డీవో, తహసీల్దార్లు పోర్టల్‌లో తమ పరిధిలో ఉన్న మాడ్యుల్స్ కూడా పరిష్కరించకుండా ఎందుకు పెండింగ్ ఉంచుతున్నారో అర్థం కావడం లేదన్నారు. దీనిపై అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. ఈ కాన్ఫరెన్స్‌లో అడిషనల్ కలెక్టర్ మోతీలాల్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ఉమారాణి, మేనేజర్ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో 'ధనలక్ష్మి' ప్రయాణం!

- ఆరు నెలల్లో 50లక్షల మంది మహిళా ప్రయాణికులు
- కిక్కిరిసిపోతున్న బస్సులు

మంచిర్యాలఅర్బన్: మహాలక్ష్మి పథకం ప్రవేశపెట్టిన తర్వాత ఆర్టీసీ బస్సుల్లో పరిమితికి మించి ప్రయాణం సాగుతోంది. ఒకప్పుడు ఖాళీ సీట్లతో రాకపోకలు సాగించిన బస్సుల్లో ప్రయాణికులు కిక్కిరిసిపోతున్నారు. ఆర్టీసీ యాజమాన్యం నిర్దేశించిన లక్ష్యా ని కంటే రెట్టింపు ఆదాయం వస్తోంది. ఎక్స్‌ప్రెస్, పల్లెవెలుగు బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించిన విషయం తెలిసిందే, మహాలక్ష్మి పథకం అమల్లోకి వచ్చిన తర్వాత ఆరు నెలల్లో 50లక్షల మందికిపైనే ప్రయాణం చేశారు. ప్రయాణికుల సంఖ్య, ఆదాయం పెరగడంతో ఆర్టీసీ కళకళలాడుతోంది.



ఆర్టీసీ బస్సు వద్ద ప్రయాణికులు

రెట్టింపు ప్రయాణం..

మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ఉచిత ప్రయాణంతో రెట్టింపు ఆదాయం వస్తోంది. సొంత వాహనాలు, ప్రైవేట్ వాహనాల కంటే ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణం సాగిస్తున్నారు. మంచిర్యాల డిపో పరిధిలో 148 బస్సులు ద్వారా ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేస్తున్నారు. సంస్థ బస్సుల్లో రాజధాని 7, సూపర్‌లగ్జరీ బస్సులు 25, ఎక్స్‌ప్రెస్ బస్సులు 7, పల్లెవెలుగులు 35 ఉన్నాయి. అద్దెబస్సుల్లో ఎక్స్‌ప్రెస్ 14, పల్లెవెలుగు 54 బస్సులు రాకపోకలు సాగిస్తున్నాయి. నిబంధనల ప్రకారం పల్లె బస్సుల్లో 55సీట్లు, సూపర్ లగ్జరీలో 36, రాజధాని 40, ఎక్స్‌ప్రెస్‌లో 50 సీట్లు ఉంటాయి. ప్రస్తుతం మహిళలకు ఉచిత ప్రయాణంతో బస్సుల్లో పరిమితికి మించి ప్రయాణం సాగుతోంది. ఒక్కో బస్సులో 120 మందికిపైగా ప్రయాణం చేసిన సందర్భాలు ఉన్నాయి.

మార్చిలోనే అత్యధికం..

రాష్ట్రంలో గతేడాది డిసెంబర్ 9న మహాలక్ష్మి పథకం ప్రారంభించారు. ప్రయాణ సమయంలో ఆధార్ కార్డు చూపిస్తే జీరో టికెట్ జారీ చేస్తున్నారు. ఈ పథకం అమల్లోకి వచ్చిన తర్వాత బస్సుల్లో 89,80,565 మంది ప్రయాణం చేశారు. ఇందులో ఉచిత ప్రయాణం చేసిన మహిళలు 50,16,567 మంది ఉన్నారు. చిన్నపిల్లలతో కలుపుకొని 51,69,317 మంది ప్రయాణించారు. రూ.19,91,35,000 ఆదాయం సమకూరింది. మార్చిలో 11,14,382 మంది మహిళలు అత్యధికంగా ప్రయాణించారు. రద్దీ అంతకంతకు పెరుగుతున్నా బస్సులు రాకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా నడుపుతూ ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని ఆర్టీసీ డీఎం రవీంద్రనాథ్ తెలిపారు.

మంచిర్యాల డిపోలో డిసెంబర్ 15నుంచి మే 8వరకు ప్రయాణికుల సంఖ్య

నెల	మొత్తం ప్రయాణికులు	మహిళలు	చిన్నారులు
డిసెంబర్	10,66,125	5,86,243	19,156
జనవరి	18,27,829	9,90,947	33,034
ఫిబ్రవరి	18,74,663	10,49,234	34,522
మార్చి	19,48,907	11,14,382	28,180
ఏప్రిల్	18,02,650	10,21276	29,322
మే	4,60,391	2,54,485	8536
	89,80,565	**50,16,567**	**1,52,750**

యూనిఫాంలు సకాలంలో అందించాలి

మంచిర్యాలఅర్బన్: సర్కారు పాఠశాల విద్యార్థులకు ఉచితంగా అందించే యూనిఫాంలు సకాలంలో అందించాలని కలెక్టర్ బి.సంతోష్ సూచించారు. సోమవారం స్థానిక చున్నంబట్టీ వాడలో విద్యార్థుల యూనిఫాం కుట్టు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. విద్యార్థుల యూనిఫామ్‌కు సంబంధించిన వస్త్రాన్ని అందించామని తెలిపారు. ప్రతీ కేంద్రంలో సుశిక్షితులైన మహిళల ద్వారా ప్రభుత్వ నిర్దేశించిన సమయానికి కంటే ముందే నాణ్యమైన దుస్తులు తయారు చేసి పాఠశాలలకు పంపించాలని తెలిపారు.



కుట్టు కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్

ఆర్‌ఎంపీ, పీఎంపీలపై దాడులు ఆపాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో ఆర్‌ఎంపీ, పీఎంపీలపై ఎన్ఎంసీ, టీఎస్ఎంసీ విజిలెన్స్ అధికారులు చేస్తున్న దాడులు ఆపాలని జిల్లాలోని ఆర్‌ఎంపీ, పీఎంపీలు సోమవారం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మెడిపెల్లి కైలాసం, రమేష్, రాథోడ్ రామారావు మాట్లాడుతూ జిల్లాలో గ్రామ, పట్టణ కాలనీ స్థాయిలో ప్రజలకు ప్రథమ వైద్య సేవలు అందిస్తున్న వారిని మూడు నెలలుగా వైద్యశాఖ విజిలెన్స్ అధికారులు భయభ్రాంతులకు గురిచేస్తున్నారని వాపోయారు. ఇప్పటికే 23 మందిపై అక్రమ కేసులు నమోదు చేశారని, దీంతో ప్రథమ వైద్య చికిత్స చేయడానికి భయపడాల్సిన పరిస్థితి నెలకొందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎంపీలు, పీఎంపీలు తిరుపతి, ఓంప్రకాష్, షాకీర్, ఎస్.తిరుపతి, శంకరయ్య, వెంకట్‌రెడ్డి, రాజేందర్, శ్రీనివాస్, కుమారస్వామి, క్రిష్ణ, రమేష్‌చారి, తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌కు వచ్చిన ఆర్‌ఎంపీలు, పీఎంపీలు

విద్యుత్ లైన్ ఏర్పాటు చేయాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: సీఎం గిరివికాస పథకం కింద మంజూరైన బోరుబావులకు విద్యుత్ లైన్ మంజూరు చేయాలని నెన్నెల మండలం కోనంపేట గ్రామ గిరిజన రైతులు సోమవారం కలెక్టరేట్, విద్యుత్ శాఖ ఎస్ఈ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. బోర్లు తవ్వించి నెలలు గడుస్తున్నా విద్యుత్ లైన్ ఏర్పాటుకు అటవీ శాఖ అనుమతి లేదని తెలిపారు. కన్నెపెల్లి మండలం రెబ్బెన, నెన్నెల మండలం పుష్పావానిపేట గ్రామ శివారు నుంచి విద్యుత్ లైన్ ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు బోగరాపు మారయ్య, రెడ్డి భీమయ్య, రెడ్డి పోచయ్య, పసుల లస్మయ్య, మంచాల మారయ్య, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పురుగుల మందుతాగి యువతి ఆత్మహత్య

ఆసిఫాబాద్‌రూరల్: పురుగుల మందు తాగి యువతి ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. ఆసిఫాబాద్ మండలం ఇప్పల్ నవెగాం గ్రామానికి చెందిన గుమ్మల సుష్మ (16)ని తల్లిదండ్రులు సోమవారం వ్యవసాయ పనులకు రమ్మనడంతో వెళ్లలేదు. తండ్రి అర్జున్ మందలించడంతో ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు గమనించి జిల్లా కేంద్రంలో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మంచిర్యాలకు రెఫర్ చేశారు. చికిత్సపొందుతూ సాయంత్రం మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు.

మద్యానికి బానిసై వ్యక్తి..

మందమర్రిరూరల్: పట్టణంలోని మూడవ జోన్‌కు చెందిన మేకల రవి (47)గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏఎస్సై మజీద్‌ఖాన్ కథనం ప్రకారం ..కూలీ చేసుకునే రవి తాగుడుకు బానిసయ్యాడు. తరచూ డబ్బుల కోసం భార్యను వేధించసాగాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి మద్యం మత్తులో ఉన్నాడు. మరింత మద్యానికి డబ్బులు అడగడంతో భార్య లేవని చెప్పగా గొడవకు దిగాడు. మద్యం మత్తులో గడ్డి మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. భార్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు.

కుటుంబ సమస్యలతో వ్యక్తి..

బెల్లంపల్లి: కుటుంబ, ఆర్థికసమస్యలతో బాధపడుతున్న ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. బెల్లంపల్లి టూటౌన్ ఎస్సై రమేశ్ కథనం ప్రకారం..కరీంనగర్‌లో నివాసం ఉంటున్న జడ్డపాటి జానయ్య అలియాస్ జాన్ (38) ప్రైవేట్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. అంతకుముందు జాన్ బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధి గంగారాం నగర్‌లోని ఓ ఇంటిని అద్దెకు తీసుకున్నాడు. కొన్ని నెలల క్రితం కరీంనగర్‌కు వలసవెళ్లాడు. అక్కడికి వెళ్లిన తర్వాత తన భార్యతో నుంచి గొడవలు జరుగుతున్నాయి. ఆదివారం భార్యభర్తల మధ్య గొడవ జరిగింది. భార్య తిర్యాణిలోని తన పుట్టింటికి వెళ్లింది. దీంతో మనస్తాపం చెందిన జాన్ బెల్లంపల్లిలోని ఇంట్లో రాత్రి గుర్తు తెలియని మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వడదెబ్బతో రైతు మృతి


ముత్తయ్య (ఫైల్)

దహెగాం: మండలంలోని గిరవెల్లికి చెందిన రైతు నిట్టురి ముత్తయ్య (60) వడదెబ్బతో మృతిచెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం..సోమవారం ఉదయం ముత్తయ్య ఉపాధి పనికెళ్లి ఇంటికి వచ్చాడు. అనంతరం వరిగడ్డి తీసుకురావడానికి పొలానికి వెళ్లాడు. ఈక్రమంలో ఎడ్లబండిలో ఎండుగడ్డిని నింపుతుండగా వాంతులు చేసుకుని అస్వస్థతకు గురై అక్కడిక్కడే మృతి చెందాడు. కుటుంబీకులు సంఘటన స్థలానికి వెళ్లి చూడగా ముత్తయ్య అప్పటికి మృతిచెందాడు.

ట్రిపుల్‌ఐటీ నోటిఫికేషన్ విడుదల

- 'ఇంటిగ్రేటెడ్' విద్యపై విద్యార్థుల చూపు
- ఆరేళ్ల సాంకేతిక విద్యతో అద్భుతాలు
- ఏటా వందలాది మందికి ఉద్యోగాలు
- రాష్ట్రవ్యాప్తంగా సీట్ల కోసం పోటీ



భైంసా(ముథోల్): ప్రతిష్టాత్మక బాసర ట్రిపుల్‌ఐటీలో నూతన విద్యాసంవత్సరంలో ప్రవేశాలకు సంబంధించి వర్సిటీ అధికారులు సోమవారం ఆన్‌లైన్‌లో నోటిఫికేషన్ విడుదల చేశారు. జూన్ 1 నుంచి 22 వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. www.rgukt.ac.in వెబ్‌సైట్‌లో, ఈమెయిల్ ద్వారా admissions@rgukt.ac.in సందర్శించాలని సూచించారు. ఆరేళ్ల సమీకృత(ఇంటిగ్రేటెడ్) ఇంజనీరింగ్ కోర్సు కోసం ఆసక్తి ఉన్న విద్యార్థులు టీజీ ఆన్‌లైన్, మీసేవ, యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవచ్చని ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ వెంకటరమణ తెలిపారు. ఈ ఏడాది పదోతరగతి పరీక్షలు ముగిసి ఫలితాలు కూడా వచ్చేశాయి. ఉత్తమ జీపీఏ సాధించిన విద్యార్థులంతా కోర్సుల ఎంపికపై కసరత్తు చేస్తున్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ఏ కాలేజీలో చదివించాలో.. ఏ కోర్సులు చేయించాలో.. అనే విషయంపై విద్యావేత్తల సలహాలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం ఎక్కడ చూసినా విద్యార్థుల చదువులపైనే ప్రత్యేక చర్చ కొనసాగుతోంది. తెలంగాణలోనే ఏకైక విద్యాలయ ప్రాంగణాన్ని కలిగి ఉన్న బాసర ట్రిపుల్‌ఐటీ నోటిఫికేషన్ విడుదల కావడంతో ఇక్కడ దరఖాస్తు చేసుకునేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. చాలామంది తల్లిదండ్రులూ తమ పిల్లలను ఇక్కడే చదివించాలనుకుంటున్నారు.

గ్రామీణ విద్యార్థులకు వరం..

గ్రామీణ విద్యార్థులకు అత్యుత్తమ సాంకేతిక విద్యను అందించే బాసర ట్రిపుల్‌ఐటీలో ప్రవేశాలకు రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు పోటీపడుతుంటారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన పల్లె విద్యార్థులకు బాసర ట్రిపుల్‌ఐటీ సువర్ణ అవకాశంగా మారింది. ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సుకు సంబంధించి బాసర ట్రిపుల్‌ఐటీలో ఏటా పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానించి అందులో అర్హత ఉన్నవారిని ఎంపిక చేసి సీట్లను కేటాయిస్తుంది. మూడేళ్లక్రితం ప్రవేశాలకు సంబంధించి మొదటిసారిగా పాలిసెట్ అర్హతను జోడించి సీట్లను కేటాయించారు. అప్పట్లో కోవిడ్ నేపథ్యంలో పాఠశాలలు మూసి ఉండడంతో పదో తరగతి విద్యార్థులను పరీక్షలు లేకుండానే ఉత్తీర్ణులు చేశారు. అలాంటి పరిస్థితుల్లో విద్యార్థుల సీట్ల కేటాయింపు ప్రక్రియలో పాలిసెట్ అర్హతను జోడించి సీట్లు కేటాయించారు. ఈ యేడు పాత విధానంలో సీట్లు భర్తీ చేయనున్నారు.

ఏటా భారీగా దరఖాస్తులు

బాసర ట్రిపుల్‌ఐటీలో చదివేందుకు రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు ఆసక్తి కనబరుస్తారు. నోటిఫికేషన్ ప్రక్రియ వెలువడడంతోనే ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తాం. ఇక్కడ సీటు దక్కించుకునేందుకు ఏటా 30 వేలకు పైగానే విద్యార్థులు దరఖాస్తు చేసుకుంటున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఇక్కడ చదివేందుకు పోటీ పడుతున్నారు.- **వెంకటరమణ, ఇన్‌చార్జి వీసీ**

వేల సంఖ్యలో దరఖాస్తులు..

బాసర ట్రిబుల్ ఐటీలో దరఖాస్తు చేసుకునే విద్యార్థుల సంఖ్య ఏటా పెరుగుతోంది. 2020-21లో 32వేల మంది విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోగా 2021-22లో 20,178 మంది, 2022-23లో 31,432 మంది, 2023-24లో 32,635 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు.

సమీకృత విద్యావిధానం...

ట్రిపుల్‌ఐటీలో ఆరేళ్లపాటు ఇంటర్‌తో పాటు సమీకృత ఇంజనీరింగ్ విద్య కొనసాగుతోంది. మొదటి రెండేళ్లు ఇంటర్ తత్సమాన పీయూసీ కోర్సు నేర్పిస్తారు. అనంతరం అందులో మెరిట్ ఆధారంగా మరో నాలుగేళ్ల ఇంజనీరింగ్ సీట్లను ఎంపిక చేసుకోవచ్చు. పీయూసీ విద్య అనంతరం మెరుగైన అవకాశాలు వస్తే విద్యార్థులు ఇక్కడి నుంచి బయటకు వెళ్లి చదువుకునే అవకాశం కూడా ఉంది. నాలుగేళ్ల బీటెక్‌లో సివిల్, కెమికల్, కంప్యూటర్, ఎలక్ట్రానిక్స్, ఐటీ, ఈసీఈ, ఎంఎంఈ కోర్సులు అందిస్తున్నారు. మొదటి రెండేళ్ల పీయూసీలో సాధించిన మార్కుల ఆధారంగానే బీటెక్‌లో కోర్సులు కేటాయిస్తారు. ఇక్కడ ఎంపికైన విద్యార్థులకు బాసర ట్రిపుల్‌ఐటీ అధికారులు అన్ని వసతులను సమకూరుస్తారు. ల్యాప్‌టాప్, అందరికీ ఒకే రకమైన దుస్తులు, షూస్, స్పోర్ట్స్ డ్రెస్ అందిస్తారు. హాస్టల్, భోజన వసతి యూనివర్సిటీయే కల్పిస్తుంది. చదివే విద్యార్థుల కోసం శారీరక, మానసిక వికాసానికి ఆటలు, వ్యాయామం, సాంస్కృతిక రంగాల్లో రాణించేందుకు సైతం తరగతులు నిర్వహిస్తున్నారు. బాసర ట్రిపుల్‌ఐటీలో ప్రత్యేక వైద్యశాల, అధునాతనమైన ల్యాబ్స్, డిజిటల్ లైబ్రరీ అందుబాటులో ఉన్నాయి.

ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ఉట్నూర్‌రూరల్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని తోటి, కొలాం, కోలావర్ తెగలకు చెందిన గిరిజన విద్యార్థుల నుంచి గురుకుల పీవీటీజీ ప్రతిభ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా ఒక ప్రకటనలో తెలిపారు. 2023-24 విద్యాసంవత్సరంలో పదవ తరగతి ఉత్తీర్ణులైన బాలబాలికలు అర్హులని పేర్కొన్నారు. ఈ నెల 30న ఉదయం 10గంటలకు గిరిజన గురుకుల జూనియర్ కళాశాల(బాలికలు) ఉట్నూర్ కేబీ కాంప్లెక్స్‌లో ప్రవేశానికి కౌన్సెలింగ్ నిర్వహిస్తామని తెలిపారు. కౌన్సెలింగ్‌కు వచ్చే విద్యార్థులు మెమో, బోనాఫైడ్, టీసీ, కుల, ఆదాయ, ఫిజికల్‌ఫిట్నెస్, ఆధార్, నిజధ్రువీకరణ పత్రాలు, రెండు జతల జిరాక్స్, పాస్‌ఫొటోలతో హాజరు కావాలని కోరారు.

ఐఎన్టీయూసీ బెల్లంపల్లి రీజియన్ ఇన్‌చార్జిగా సమ్మయ్య


కాంపెల్లి సమ్మయ్య

మందమర్రిరూరల్: ఐఎన్టీయూసీ కేంద్ర కమిటీ సీనియర్ ఉపాధ్యక్షుడు కాంపెల్లి సమ్మయ్యను బెల్లంపల్లి రీజియన్ ఇన్‌చార్జిగా నియమిస్తూ సెక్రెటరీ జనరల్ జనక్‌ప్రసాద్ ఆదేశాలు జారీ చేశారు. మందమర్రి ఏరియాలోని ఐఎన్టీయూసీ ఆఫీస్‌లో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కాంపెల్లి సమ్మయ్యను సన్మానించారు. తనపై నమ్మకంతో పదవి అప్పగించిన జనక్‌ప్రసాద్‌కు సమ్మయ్య కృతజ్ఞతలు తెలిపారు.

నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదు


ఫిర్యాదు పత్రంతో మల్లీడి గ్రామస్తులు

మంచిర్యాలఅగ్రికల్చర్: భీమిని మండలం మల్లీడి పంచాయతీ నిధులు దుర్వినియోగం చేసిన మాజీ సర్పంచ్ బెల్లం సంతోష్‌పై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు సోమవారం కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2019-20, 2022-23 ఆర్థిక సంవత్సరం వరకు కొనసాగిన సర్పంచ్ గ్రామ పంచాయతీకి చెందిన నిధులు దుర్వినియోగం చేశారని పేర్కొన్నారు. నిధుల వినియోగం, వ్యయాలకు సంబంధించి ఎలాంటి గ్రామసభ ఆమోదం లేదన్నారు. చేతి బోరుబావులు, డ్రెయినేజీ మరమ్మతు, విద్యుత్ దీపాలు, చెత్తబుట్టలు, మురుగుకాల్వల నిర్మాణం, పారిశుధ్య, పల్లెప్రగతి, పిచ్చిమొక్కలు తొలగింపు, సీసీరోడ్లు, వైకుంఠధామాలు, తదితర అభివృద్ధి పనులకు వెచ్చించిన ఖర్చుల వివరాలపై విచారణ చేపట్టాలన్నారు. గ్రామస్తులు ఆకుల సత్తయ్య, దుర్గం బిక్కయ్య, ఆకుల శ్రీనివాస్, ఇందూరి అశోక్, ఆకుల సురేష్, ఆకుల ఉదయ్‌కిరణ్, దుర్గయ్య, అగ్గ రమేశ్ ఉన్నారు.

క్రీడాకారులకు అభినందన


అభినందిస్తున్న జీఎం సంజీవరెడ్డి

శ్రీరాంపూర్: కోలిండియా, ఆలిండియా పబ్లిక్ సెక్టార్ టోర్నమెంట్లో పలు క్రీడల్లో మెడల్స్ సాధించిన శ్రీరాంపూర్ క్రీడాకారులను ఏరియా సంజీవ రెడ్డి అభినందించారు. జీఎం కార్యాలయంలో వారికి కంపెనీ తరపున సోమవారం నగదు బహుమతి అందించి సన్మానించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ శ్రీరాంపూర్ ఏరియా క్రీడాకారులు కోలిండియా, ఆలిండియా పబ్లిక్ సెక్టార్ టోర్నమెంట్లతో ప్రతిభ కనబర్చడం గర్వకారణమన్నారు. ఏరియా ఎస్ఓటు జీఎం పురుషోత్తంరెడ్డి, ఏజీఎం ఫైనాన్స్ మురళీధర్, డీజీఎం (పర్సనల్) అరవిందరావు, ఏఐటీయూసీ అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ కొమురయ్య, అధికారుల సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వరరెడ్డి, స్పోర్ట్స్ గౌరవ కార్యదర్శి పాల్ సృజన్, సూపర్వైజర్ అశోక్, కోఆర్డినేటర్ తోట సురేశ్ పాల్గొన్నారు.

ముగ్గురు డిస్కం అధికారులకు సన్మానం


డీఈ రాజన్నను సన్మానిస్తున్న ఎస్ఈ శ్రావణ్‌కుమార్

బెల్లంపల్లి: విద్యుత్ రంగంలో ఉత్తమ సేవలు అందించిన ముగ్గురు డిస్కం అధికారులను సోమవారం బెల్లంపల్లి డిస్కం డీఈ కార్యాలయంలో ప్రత్యేకంగా సన్మానించారు. గత ఏప్రిల్‌లో వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సరఫరా చేసి, ఆశాజనకంగా రెవెన్యూ వసూళ్లు చేయడంతోపాటు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల ఫెయిల్యూర్స్‌ను తగ్గించడం తదితర సత్ఫలితాలు సాధించడం ప్రాతిపదికగా తీసుకున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలో ఉత్తమ అధికారిగా బెల్లంపల్లి డిస్కం డీఈ బి.రాజన్న, బెల్లంపల్లి సబ్ డివిజన్ పరిధిలో ఉత్తమ ఏడీఈగా కాటం శ్రీనివాస్, మంచిర్యాల సర్కిల్ పరిధిలో ఉత్తమ అధికారిగా బెల్లంపల్లి రూరల్ ఏఈ రామ్‌మనోహర్‌లను టీజీ ఎన్పీడీసీఎల్ సీఅండ్ఎండీ వరుణ్‌రెడ్డి ప్రకటించారు. ఈ మేరకు మంచిర్యాల ట్రాన్స్‌కో ఎస్ఈ శ్రావణ్‌కుమార్ సదరు అధికారులకు శాలువా కప్పి సన్మానం చేసి సీఎండీ పంపించిన మెమోంటో అందజేశారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి సబ్ డివిజన్ పరిధిలోని ట్రాన్స్‌కో ఏడీఈలు, ఏఈలు ఇతర క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

'రైతులను ముంచుతున్నారు'


కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో ధాన్యం కొనుగోలులో వ్యాపారులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, రైస్‌మిల్లర్లు, ట్రాన్స్‌పోర్టు కుమ్మక్కై రైతులను ముంచుతున్నారని సీపీఎం నాయకులు కలెక్టరేట్ ఎదుట సోమవారం ఆందోళన చేపట్టారు. 40 కిలోల బస్తాలు, తాలు, తేమ పేరుతో రెండు నుంచి ఐదు కిలోల కటింగ్ చేస్తున్నారని, లారీ మిల్లు వద్దకు వెళ్లిన తర్వాత అన్‌లోడ్ కావాలంటే కటింగ్‌కు ఒప్పుకోవాలని బెదిరిస్తున్నారని ఆరోపించారు. ఐకేపీ సెంటర్‌లో కొనుగోలు చేయకుండా పక్క గ్రామాల్లో తక్కువ ధరకు కొనుగోలు చేసి ఐకేపీ సెంటర్‌లో కొనుగోలు చేసినట్లుగా రాస్తున్నారని, లారీలు రావడానికి రూ.3 వేల నుంచి రూ.5 వేల వరకు రైతుల వద్ద వసూలు చేస్తున్నారని ఆరోపించారు. అనంతరం కలెక్టరేట్ ఏవోకు వినతిపత్రం అందజేశారు. సీపీఎం నాయకులు కుమార్, మధు, బుధక్క కరీంబీ, శంకరక్క, తిరుపతి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సూపర్‌బజార్‌ను సందర్శించిన ఎండీ


సిబ్బందితో మాట్లాడుతున్న ఎండీ

రామకృష్ణాపూర్: పట్టణంలోని సింగరేణి సూపర్‌బజార్‌ను సంస్థ సూపర్‌బజార్ ఎండీ విలాస్ పోతేదార్ సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బందితో మాట్లాడుతూ వినియోగదారులకు నాణ్యమైన సరుకులు అందజేయడంతోపాటు కస్టమర్లతో మర్యాదపూర్వకంగా మెలుగాలన్నారు. డిజిటల్ లావాదేవీలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. డీఎం సుదర్శన్, సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వే అండర్‌బ్రిడ్జి తాత్కాలికంగా మూసివేత

తాండూర్: మండలంలోని కేజీబీవీ సమీపంలో గల తాండూర్ రైల్వే అండర్ బ్రిడ్జిని తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు రైల్వే అధికారులు ఉత్తర్వులు జారీచేశారు. రైల్వే అండర్ బ్రిడ్జి గుంతలమయమై వాహనదారులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్న నేపథ్యంలో ఇటీవల ఎంపీటీసీ సిరంగి శంకర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఈసా రైల్వే అధికారులను కలిసి బ్రిడ్జి మరమ్మతుల కోసం వినతిపత్రం అందజేశారు. దీంతో స్పందించిన అధికారులు అండర్ బ్రిడ్జి రోడ్డు మరమ్మతుకు ఈనెల 29 నుంచి జూన్ 9వ తేదీ వరకు 12 రోజుల పాటు రాకపోకలు నివారించేలా తాత్కాలికంగా మూసివేయనున్నట్లు పేర్కొన్నారు.

జూన్ 3నుంచి ఎస్ఎస్‌సీ సప్లిమెంటరీ పరీక్షలు

మంచిర్యాలఅర్బన్: జూన్ 3నుంచి ఎస్ఎస్‌సీ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు డీఈవో యాదయ్య తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. వేసవి నేపథ్యంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఆరోగ్య కార్యకర్తలను అందుబాటులో ఉంచుతున్నామని పేర్కొన్నారు. జూన్ 3నుంచి 13వరకు, ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు.

చోరీకి పాల్పడిన వ్యక్తికి జైలు

మంచిర్యాలక్రైం: చోరీకి పాల్పడిన వ్యక్తికి 20 నెలల జైలుశిక్ష, రూ.100 జరిమానా విధిస్తూ జూనియర్ సివిల్ జడ్జి, జ్యూడిషియల్ ఫాస్ట్ ట్రాక్ మెజిస్ట్రేట్ కె.నిరోష తీర్పునిచ్చినట్లు స్థానిక సీఐ బన్సిలాల్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. జిల్లాకేంద్రంలోని హమాలీవాడకు చెందిన బి.కుమార్ ఇంట్లో 2022 అక్టోబర్ 3న తిలక్‌నగర్‌కు చెందిన మెస్రం రాజు చోరీ చేశారు. బాధితుడి ఫిర్యాదుతో అప్పటి ఎస్సై ఏ.రాజేందర్ కేసు నమోదు చేశారు. నిందితుడిని కోర్టులో హాజరుపర్చారు. కోర్టు అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి.ప్రేమలత సాక్షులను విచారించగా నేరం రుజువుతో మెజిస్ట్రేట్ ఈ మేరకు తీర్పు వెలువరించారు.

విద్యుత్ తీగలు తగిలి ఆవు మృతి

బోథ్: మండలంలోని చింగతూడలో విద్యుత్ తీగలు తగిలి ఆవు మృతిచెందింది. ఆదివారం సాయంత్రం ఈదురుగాలులు వీయడంతో చేనులో 11 కేవీ విద్యుత్ వైర్లు కిందపడ్డాయి. అక్కడే ఉన్న ఆవుకు వైర్లు తగలి అక్కడికక్కడే మృతి చెందింది. తనకు పరిహారం అందించాలని బాధిత గొడం లక్ష్మణ్ కోరాడు.

వేతన వెతలు

- పంచాయతీల్లో నిలిచిన ఆరునెలల వేతనాలు
- ఇబ్బందుల్లో కార్మికులు


పారిశుధ్య పనుల్లో మల్టీపర్పస్ కార్మికులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఓ వైపు కొలువుదీరిన నూతన ప్రభుత్వం.. మరోవైపు పార్లమెంట్ ఎన్నికలు వెరసి పంచాయతీల్లోని కార్మికులకు తలనొప్పిగా మారింది. గత ఆరు నెలలుగా వేతనాలు అందకుండా పారిశుధ్య కార్మికులు అవస్థలు పడుతున్నారు. ఆర్థికభారాన్ని మోస్తూ కుటుంబ పోషణ నెట్టుకు వస్తున్నారు. పస్తులుంటూ, అప్పు చేసి మరీ కష్టాల మధ్య పనులు చేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు మొరపెట్టుకుంటున్నా ఫలితం లేకపోయింది. దాదాపు ఏడాదిన్నరగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్(ఎస్ఎఫ్‌సీ) నిధులు, ఇక ఆరు నెలలుగా కేంద్రం నుంచి రావల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల కావడం లేదు. దీంతో ఏడాదికి పైగానే పంచాయతీల్లో సాధారణ నిధుల నుంచి కార్మికులకు జీతాలు ఇచ్చి ఏదోలా నెట్టుకువస్తున్నారు.

జిల్లాలో..

జిల్లాలోని 16 మండలాల్లో 311 పంచాయతీలు ఉన్నాయి. మొత్తం 1,080 మంది పారిశుధ్య కార్మికులు విధులు నిర్వర్తిస్తున్నారు. ఒక్కో కార్మికుడికి రూ.9,500 వేతనం చెల్లిస్తుండగా ఒక్కో గ్రామానికి జనాభాకు అనుగుణంగా ఇద్దరి నుంచి మొదలు 8 మంది వరకు కార్మికులు పని చేస్తున్నారు. ప్రస్తుతం పంచాయతీల్లో కార్మికులను మల్టీపర్పస్ కార్మికులుగా పిలుస్తుండగా వీరు పారిశుధ్య పనులతోపాటు ఇంటింటికీ వెళ్లి ట్రాక్టర్ ద్వారా చెత్త సేకరించడం, సెగ్రిగేషన్ షెడ్లలో తడి, పొడిచెత్త వేరుచేయడం, వర్మీ కంపోస్ట్ తయారీ చేయడం, మొక్కలకు నీరు పట్టడం, నీటి సరఫరా విభాగంలో పని చేయడం వంటి పనులు చేస్తున్నారు. వీరికి సకాలంలో వేతనాలు రాక ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు. వేతనాల కష్టాలతో కార్మికులు విధుల నిర్వహణలో అంతంత మాత్రంగా పని చేయకపోవడంతో గ్రామాల్లో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారుతోంది. అయితే పంచాయతీల్లో కనీసం కార్మికుల వేతనాలను ఇవ్వడంతో ఎలాంటి గ్రాంట్లు రాకపోవడంతో వారికీ ఏమీ చేయలేకపోతున్నామని ప్రత్యేకాధికారులు, కార్యదర్శులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వేతనాలు అందించేలా చర్యలు చేపట్టాలని కార్మికులు కోరుతున్నారు.

అప్పు చేస్తున్నాం



వేతనాలు అందక కుటుంబ పోషణకు అప్పు చేయాల్సి వస్తోంది. సర్పంచ్ ఉన్నప్పుడు చేబుదులు ఇచ్చి అవసరానికి ఆదుకునేవాడు. ఇప్పుడు ప్రత్యేకాధికారిని జీతం అడిగే పరిస్థితి లేదు. ఎన్నికలు అంటూ పంచాయతీకి రాకపోవడంతో ఇన్ని రోజులు జీతాలు రాలేదు. ఎప్పుడు ఇస్తరో తెలుస్తలేదు. – **మల్యాల పోచయ్య, మల్టీపర్పస్ కార్మికుడు, హాజీపూర్**

వేతనాలు అందేలా చూస్తాం



ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి కార్మికులకు వేతనాలు అందేలా చూస్తాం. నూతన ప్రభుత్వం కొలువు దీరడం, ఎన్నికలు రావడంతో నిధులు డ్రా చేయడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఎన్నికల కోడ్ ముగియగానే బకాయిలు పడిన వేతనాలు చెల్లిస్తాం. కేంద్ర, రాష్ట్రాల వారీగా నిధులు మంజూరు కాగానే వేతనాలు రెగ్యులర్ అవుతాయి. – **వెంకటేశ్వర్‌రావు, డీపీవో**

తాళం వేసిన అరగంటకే చోరీ..

- న్యూ నాగార్జున కాలనీలోని క్వార్టర్లలో ఘటన
- డాగ్‌స్క్వాడ్, క్లూస్ టీమ్‌తో విచారణ


విచారణ చేస్తున్న ఎస్సై రవికుమార్

నస్పూర్: ఇంటికి తాళం వేసిన అరగంటకే చోరీ జరిగిన ఘటన నస్పూర్‌లోని న్యూనాగార్జునకాలనీలో సోమవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. గుమ్మడి సత్తయ్య ఎస్సార్పీ-1 గనిలో జనరల్ మజ్దూర్‌గా పనిచేస్తున్నాడు. న్యూ నాగార్జున కాలనీలో ఎన్‌డీ 3016 క్వార్టర్‌లో ఉంటున్నాడు. సత్తయ్య సెకండ్ డ్యూటీకి వెళ్లాడు. ఆయన భార్య సాయంత్రం ఇంటికి తాళం వేసి వాకింగ్‌కు వెళ్లింది. అరగంట వ్యవధిలో తిరిగి వచ్చి చూడగా క్వార్టర్ వెనుకాల ఉన్న డోర్ తెరిచి ఉంది. చోరీ జరిగినట్లు గమనించి పోలీసులు సమాచారం అందించారు. దొంగలు ఇంట్లో చొరబడి రూ.4.50 లక్షల నగదు, 15 తులాల బంగారం, 30 తులాల వెండిని ఎత్తుకెళ్లారని బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ అకుల అశోక్, ఎస్సై రవికుమార్‌లు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. డాగ్ స్క్వాడ్‌తో గాలింపు చర్యలు చేపట్టారు. క్లూస్ టీమ్ విచారణ చేపట్టారు.

ఎండదెబ్బతో యాచకుడి మృతి

వాంకిడి: ఎండదెబ్బ తగిలి ఓ వృద్ధ యాచకుడు మృతి చెందినట్లు ఎస్సై సాగర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..మహారాష్ట్రలోని దేవాడ గ్రామానికి చెందిన గేడం కుర్‌కుడె శ్రీ గణేష్(75) ప్రతీ రోజు భిక్షాటన చేసుకుని జీవనం గడిపేవాడు. సోమవారం ఉదయం మండల కేంద్రంలోని మహారాష్ట్ర బస్సులు ఆగే బస్టాండ్‌లో శ్రీ గణేశ్ పడి ఉండటాన్ని తమ్ముడి కుమారుడు గమనించి కుటుంబీకులకు సమాచారం అందించారు. శ్రీ గణేశ్ కుమారుడు గేడం సచిన్ అక్కడికి చేరుకుని పరిశీలించగా అప్పటికే మృతి చెందాడు. ఎండదెబ్బ తగిలి చనిపోయి ఉంటాడని మృతుడి కుటుంబ సభ్యులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సచిన్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.